# దేవయ్య జీవితము

రాయసం వేంకటశివుడు గారు, యం. ఏ., యల్. టి.

ఏ పట్టణమునకు దేవయ్య కాపుర మెప్పుడు వచ్చెనో, యతనిస్థితిగతు లప్పు డెటులుండెనో, మనకు వివరముగాఁ దెలియదు. అతఁడు నగర వాస్తవ్యులలో మిక్కిలి పూర్వుఁడని యందఱు నొప్పుకొనుచున్నారు. పూర్వ మతనిసంసారము మిగుల బీదస్థితియం దుండెను. దీనికి నిదర్శనముగఁ గొన్ని సంగతు లిప్పటికి నీపురవాసులు చెప్పుకొనుచున్నారు. దేవయ్య కూలినాలి చేసి, పొట్టపోసికొనుచుండెడివాఁడు. వేఁడి నీళ్లకు చన్నీళ్లు తోడగునట్లు, భార్య నీలమ్మ ఏరుపిడకలకుఁ బోయి గడించినసొమ్ము మగని కిచ్చుచుండును. దేవయ్యమేనత్త "మడేలుమంగమ్మ" యని కొందఱి మతము. పెద్దచంద్రవంక బొట్టులోనుండు మంగమ్మ ముఖము తమ కింకను జూచినట్టే యుండునని మున్నటి వఱకు పెద్ద లనుచుండిరఁట. కాని, గిట్టనివా రీసంగతి నిటీవల వెలయించి యుండవలయును. దేవయ్య యింట నిప్పటికిని గలయఱిగిపోయిన తాపీలు, గూలమట్టములను బట్టి, వీనిపూర్వులసంగతులు కొంత తేటపడఁగలవు.

* * * * *

మొట్టమొదట కుటుంబపోషణము జరుగుట వారి కెంతో కష్టముగ నుండెను. దినవెచ్చములకై తనకు బాకీ పడినయర్ధరూపాయి నీయుమని కోమటికామయ్య యొక నాఁడు తనదుకాణమునొద్ద నీలమ్మను నిలువఁబెట్టెను. సిగ్గుచేతను దైన్యముచేతను తలవంచుకొనియున్న యామానవతిని వర్తకుఁడు తూలనాడి "సమాధానము చెప్పక వెళ్లిపోవుచున్నావేమ ?"ని యామె చీరచెఱఁగుఁబట్టి లాగెను. అంత, "ఇహిహీ !" యని యచటఁ గూడిన కొందఱు నవ్విరి. "ఔను, న్యాయమే ; తినినసొమ్మ యవద్దా ?" యని కొందఱు తెగవు చెప్పిరి. ఇది యుక్తము గాదని కొందఱు తలంచియు, తటస్థముగ నుండిరి. నీలమ్మ కన్నులనుండి బొటబొట నీరుకాఱుచుండెను. ఆ దారిని చుట్టకాల్చుచుఁ బోవుచున్న కరణము బుచ్చిరాజు కంట నిదిపడెను. స్త్రీచీర చెంగుబట్టుకొనియున్న కామయ్యకరముమీఁద తోడనే కరణము చేతికఱ్ఱ పిడుగువలెఁ బడెను. బుచ్చిరాజు మిక్కిలి కోపి. ఆతఁడు వర్తకునిదొడలు పగులఁగొట్టి, "దౌర్భాగ్యుఁడా ! డబ్బుమాచుకొని నీకుఁ గండ్లు పూడిపోవుచున్నవే! పుప్పు ఉల్లిపాయ చేతితో పుణ్యవతిదేహము నంటితివా ? బుద్ధితెచ్చుకొని బ్రతుకుము !" అని మందలించి, యాఱిపోయిన చుట్టను నిప్పు ముట్టించుకొని, తనదారిని తాను వెడలిపోయెను.

ఇంకొకపరికూడ దేవయ్యభార్యకు బుచ్చిరాజే శరణమయ్యెను. దేవయ్య పొదుపరి, సత్సహవాసము చేయువాఁడు. ఐనను, చేత డబ్బు చేరుచున్నకొలఁదిని, వానికి గర్వ మధికమగుచుండెను. దుస్సహవాసములఁజేసి యతఁడు త్రాగుబోతయ్యెను. తాను సంపాదించినసొమ్మెప్పటి కప్పుడు మగనిచేతఁ బెట్టుటచేత, నీలమ్మ యసహాయపళెనుండెను. సాయంకాలము తప్పత్రాగి యిల్లు చేరుచుండు దేవయ్య, ఇంకను ద్రవ్యమిమ్మని భార్యను బీడించుచుండును. తగవు చెప్పుటకును, వేడుక చూచుటకును, చుట్టుపట్టులవారు కూడుచుందురు. త్రాగుడుచేత సగము మతిచెడిన దేవయ్య, నీలమ్మను సిగపట్టి యీడ్చి కొట్టి, తనపౌరుషమును నలుగురికిని జూపుచుండును. "వానిభార్యను వాఁడు శిక్షించుకొనుచున్నాఁడు. మన కెందు" కని, చూచువా రూరకుందురు. ఇది నిత్యకర్మగాఁ జేసికొనిన దేవయ్య యొకనాఁడు భార్య నెక్కుడుగా గాసిపెట్టెను. ఆగర్భవతి పొట్టమీఁద గట్టిగ నాతఁడు తన్నఁగా, పాప మామె స్మృతితప్పి పడిపోయెను. కొంతసేపటికిఁ దెప్పిదేలిన సతి నపుడైన నాతఁడు విడువఁడు. "వగలాడీ! ఇంక దెబ్బలు తప్పునని యిటుల నటించుచున్నావా ? చూడు నీమూర్ఛవదలించెద !"నని యామూర్ఖుఁడు కత్తినో కటారినో తెచ్చుట

కింటిలోని కట్టెపోయెను. తన్నుఁ గాచువారు లేరని నీలమ్మ యంతట నొకయుపాయము చేసెను. పతి యిలు సొరఁగానే, మెల్లఁగ దలుపుమూసి, గొళ్లెముఁ బెట్టెను. దగ్గఱనున్న యొకపిల్ల చెవిలో నీలమ్మ యేదో మాట చెప్పి, దాని నెదటికో పంపెను. ఈలోపల, లోనఁ జిక్కువడిన దేవయ్య తనసతి ననరానితిట్లు తిట్టి, తలుపు గట్టిగఁ గొట్టుచుండెను.

ఇంతలో కరణము బుచ్చిరాజు వచ్చెను. కన్నీటఁ దోఁగుచున్న నీలమ్మవలన నుదంతము గ్రహించి, బుచ్చిరాజు, అచటఁ జేరినమూకను బంపివైచి, వాకిట చింతచెట్టునుండి చువ్వయొకటి విఱిచి, తలుపు తీసెను. ప్రాంత మొద్దుకత్తితో నాలిని బరిమార్పఁబూనిన దేవయ్య యంత ముందడుగు వెట్టఁగనే, వానిచేతినుండి కత్తి పెఱికివైచి, కరణము వానిని జుట్టుపట్టుకొని మోదెను. బెత్తపుమహిమచే దేవయ్యకు, కాయశుద్ధి కాఁగా, మైకపు దయ్యమాతని విడిచి పలాయనమయ్యెను! తన్నీసారి మన్నించి విడిచినచో, ముందెపుడును కల్లుముంతచెంతకును, కులకాంతమీఁదకిని, కరములు రానీయనని దేవయ్య దీనత్వముతోఁ గరణమును వేడుకొనెను. అప్పటినుండియు నీలమ్మ కష్టములను విముక్తి గలిగెను. ఆమె కుటుంబమునకు శాంతి సమకూరెను.

* * * * *

దురభ్యాసములనుండి తేర్చుటకు బుచ్చిరాజు కొంతసహాయపడినను, దేవయ్యకు నిజముగ మేలుచేసినది నారాయణవర్మయే. దేవయ్య తెలివితేటలు నారాయణవర్మ గ్రహించి, యెట్లయిన వానిని బాగుచేయవలెనని వాని కక్షరములు నేర్పెను. పాపము, సాయంకాలమువఱకుఁ బనిచేసిన దేవయ్య ఇంటికి వచ్చుసరికి వానికి కాలుసేతులు పీకుకొనిపోవును; పిచ్చియెత్తినట్లుండును. పూర్వపుపాపపాశములె వానినిట్లు బంధించుచున్నవని గ్రహించి, దేవయ్య దృష్టిని చదువునకును, సత్సాంగత్యమునకును వర్మ మళ్లింపఁబూనెను. క్రమక్రమముగ దేవయ్య రుచులలో మార్పుగలిగెను. పుస్తకములమీఁదకిని, సత్కాలక్షేపములకును దేవయ్య మనసిపుడు పరువెత్తుచుండును.

నారాయణవర్మ బోధనల మూలమున దేవయ్య యిపుడు వృత్తిమార్చుకొనినట్లు తోఁచుచున్నది. ఇపుడతఁడు రంగులపనివాఁడై, దినమున కేడెనిమిదణాలు తెచ్చుకొనుచుండెను. చదువుకొన్నవాఁడనియు, సద్వర్తనగలవాఁడనియును పలువురు దేవయ్యకే పనులిచ్చుచుందురు. వర్మగారిసహాయమున దేవయ్య యంతట నొకచిన్నపరీక్షనిచ్చెను. కొంతసొమ్ము కూడఁబెట్టుకొనిన వాఁడుగావున దేవయ్య యిపుడు సేవకవృత్తి మానివైచి, సొంతవ్యాపారమునకు దిగెను. ఏవృత్తినున్నను, దేవయ్య వివేకవంతుఁడని పేరువడసెను. అతనియింట సిరి వెల్లివిరిసెను.

* * * * *

నారాయణవర్మ ప్రజాహితార్థమై స్థాపించిన "విశ్వసోదర సమాజము"న నిపుడు సభ్యులనేకులుండిరి, నిఱుపేదలకును, నిమ్నజాతిజులకును ఈసమాజము శరణ్యము. ఎల్లరకును వీరుచితముగ విద్యకఱపుదురు; చేతిపనులు నేర్పుదురు. సొంతవ్యాపారములు జరుపుకొనుచు దేవయ్య యిపుడు మిక్కుటముగ ధనార్జనము చేయుచున్నను గురువగువర్మ నడపు నీసంస్థమాట మఱచిపోక, దానికి ధనసాహాయ్యము చేయుటయేకాక, అచట శిష్యులకు తానును అప్పుడప్పుడు విద్యగఱపుచుండును. పరహితైకచింతనము ఒకరినుండియొకరికి మెల్లగనల్లుకొనెను. పట్టణమందలి విద్యాధికులు నుద్యోగస్థులును "విశ్వసోదర సమాజా"భివృద్ధినిమిత్తము పాటుపడసాగిరి. చెప్పనలవిగాని యైకమత్యము పురవాసుల కలవడినది.

ఇట్లు సంవత్సరములు గడచెను. ఇపుడీ నగరవాస్తవ్యులలోఁ బరోపకార కార్యములకుఁ బేరుగాంచినవారిలో దేవయ్య ముఖ్యుఁడు. ఏప్రక్కఁజూచినను, దేవయ్యను గొనియాడుచుండువారే. పురపాలకాధ్యక్షపదవినందియతఁడెంతో శ్లాఘనీయముగఁ బనులు జరపుకొనుచున్నాఁడు. "రావుబహద్దరు" బిరుదీతనికి లభించుతఱి జరిగిన యుత్సవమునకు జను లాబాలగోపాలము పురమందిరమునకు విచ్చేసి దేవయ్యనభినందించిరి. అన్నియెడలను దేవయ్యకీర్తి యల్లుకొనెను.

దేవయ్యకిది మిక్కిలి యుచ్చదినము లనుట కాయన యింటిసంగతులె నిదర్శనము. కలువ, తామరపూవు లున్న కొలనువలె దేవయ్యయిల్లు కలకల నవ్వుచుండెను.

పుత్రులు, పుత్రికలును, జననీ జనకులవలెనే సౌజన్యమునకు నెలవై యలరారుచుండిరి. ఆయన పెద్దకుమారునకు బుచ్చిరాజనియు, రెండవవానికి వర్మయనియు నామము లిడుటకుఁ గారణము చదువరులు సులభముగనే గ్రహింపఁగలరు. పేరులనేకాక సుగుణజాలమందును, వారు జననీజనకుల భక్తిప్రేమల కాకరమగు నాపుణ్యపురుషుల నిర్ద్వరనుబోలియుండిరి. ఈగృహము నిరతము లక్ష్మీనివాసమై వర్ధిలునని జనులు తలపోయుచుండిరి.

* * * * *

చలనము లోకస్వభావము. చలనమే లేనియెడల మనభూలోకము చిరకాలముక్రిందనే స్వర్గమో నరకమో యైయుండెడిది. పరిస్థితులందు తెలియరాకయే మార్పు లొదవుచుండును. ఐశ్వర్యాదులందేకాక సూక్ష్మరూపముననుండు జనుల యూహాపోహములందును, గుణావగుణములందును, మార్పులు గలుగవలసినదే. చలనమా, నీవెంతటి యైంద్రజాలికుఁడవు! విశ్వసృష్టి పరిపాలనములందు నీ వపరబ్రహ్మవలెఁ గానవచ్చుచున్నావు!

* * * * *

రావు బహద్దరు దేవయ్య యిప్పుడు దివాను బహద్దరయ్యెను. తామొసంగఁగల గౌరవపదవులన్నియు నొక్కసారిగ వానిమీఁదఁ గురిపించినను, దేవయ్య గుణసంపత్తునకుఁ దగిన సమ్మానము కానేరదని పట్టమిచ్చుసందర్భమున కలెక్టరు వాక్రుచ్చెను. ఇది నిజమే కావచ్చును. కాని, యీసందర్భమునఁ బ్రజలు పరిపాలకుల కెంతటి యామోదము నగపఱుచుచున్నారో ప్రభుత్వమువా రరయకుండుట శోచనీయము! ఈనాఁటి సభ కింతతక్కువమంది వచ్చుటకేమి కారణము? దేవయ్యగారి కీర్తిని జూచి జనులు కంటగించుచున్నారా!

* * * *

దేవయ్యకీర్తి యుచ్చదశనుండుట దొరతనమువారి దృష్టిపథముననేకాని, ప్రజల దృష్టిపథమునఁగాదు. ఈవల చెన్నపురినుండి యిచటికి విచ్చేసి దేవయ్యయింట విందు లారగించి యేగిన మహనీయుల మంత్రోపదేశమైననాఁట నుండియు, ఆయన మనస్సు మాఱిపోయినదని జనులను కొనుచున్నారు. అప్పటినుండియు దేవయ్య తనపూర్వపు స్నేహితుల సహవాసము మానుకొనెను. విశ్వసోదర సమాజాభివృద్ధికి పాటుపడుట కతని కిప్పుడు మనసొప్పుటలేదు. సంఘములో నెచటఁజూచినను, అతనికన్నులకు మానవరూపముననున్న తేళ్లు,త్రాఁచులునే కానవచ్చుచుండెను. ఒకనాఁడు తనను జూడవచ్చిన వర్మతో మొదట మాటాడ నిచ్చగింపకున్నను, పిమ్మట దేవయ్య సంభాషించెను. వారి దీర్ఘసంభాషణ మిట్లుముగిసెను:—

దేవయ్య: "కాఁబట్టి మనదేశమందలి సాంఘిక రాజకీయాద్యనర్థముల కన్నిటికిని బ్రాహ్మణుల కాపట్యమే కారణము!"

వర్మ: "ఇది సరికాదు. ఐనను, ఆబాధలు తొలఁగించు నుపాయ మేమైనఁ జెప్పఁగలవా?"

దేవయ్య: "దుష్టగ్గణాదమే; యింకేమున్నది? బ్రాహ్మణేతరు తలలను క్రిందికదిమిపట్టి, యింతకాలమును వారి రక్తమునుగ్రోలి మదించిన బాపలనోట మట్టిగొట్టవలసినదే! వీళ్లైనపుడెల్లను వాండ్లసాగ రాఁచవలసినదే!"

వర్మ: "నీవు చెప్పునది ఘోరముగనున్నది. తక్కినచోట్ల సంగతియేల? మనపట్టణముం దిట్టి కక్షలిదివఱకు లేవుకదా! ఒకతల్లిబిడ్డలవలె నందఱు నైకమత్యముతో మనసమాజమునఁ బనిచేయుచుండుట నీకుఁదెలియదా? లేనికుళ్లు కల్గింపనేల?"

దేవయ్య: "ఈశాంతి పద్ధతిఁబూనియే మనబ్రాహ్మణేతరు లింతహీనస్థితికి వచ్చినారు! బాపనోళ్లు మేకవన్నె పులులు! బ్రాహ్మణేతర జాతులు బాగుపడడము సుతలాం వాళ్లకిష్టములేదు. ఏసమాజమునియో పేరు పెట్టి, దుక్కిటెద్దులవలె మన బ్రాహ్మణేతరులచేఁ బనిచేయించి వచ్చేపేరు ప్రతిష్ఠలు తాము కాఁజేయుచున్నారు!"

వర్మ: "దీనికి నీవు చేసే పరిహారమేది?"

దేవయ్య: "మీరు చూస్తారుగా! బాపనోళ్లకు విరుద్ధమైన పనిలోకి బ్రాహ్మణేతరులు దిగితే, ఆఁటు తేలుతుంది! వాళ్లకుళ్లుబైట పడుతుంది! ఈపోరాటమునకు నేను కంకణంగట్టుకొన్నాను!"

వర్మ: "అయ్యో, దేవయ్యా! లేనివైరములు కల్పించుచున్నావే! ఇదేమీ బాగాలేదు—బ్రాహ్మణేతరులు నీచదశనుండుట వాస్తవమేకాని, ఉన్నవిలేనివి

బాపలనెత్తిమీఁదవేసి, వాళ్లమీఁద ధ్వజమెత్తిన లాభమేమి? ఆవిధమున మనస్థితి యెన్నటికైనా తిన్ననగునా?

నీపనులవల్ల మనముచేసే కొంచెము మంచిపనికిని విఘాతమువచ్చును. జనులలో నశాంతి కలుగును. లేనిపోని కష్టములు నీవు నెత్తిమీఁదికిఁ దెచ్చికొందువుసుమీ!".

*  *  *  *  *

ఆమఱునాఁడే దేవయ్య వర్మ కొకలేఖ వ్రాసెను. ప్రథమమునుండియు వర్మయుఁ దానును విశ్వసోదరసమాజమున నెంతో పనిచేసిరికావున ఏతత్సమాజ పరిపాలన మిపుడు బ్రాహ్మణేతరకక్షువారివశముఁ జేయుమని యందుండెను.

సర్వజన శ్రేయోదాయకమును, సర్వజనాదరణీయమునునగు తమ సమాజము నేదోయొక కక్షలోని వారిచేతఁ బడవేయుటను, వర్మగాని, తక్కినసభ్యులుగాని యొప్పుకొనకుండిరి. కావున పిమ్మట పురమునఁగూడిన యొక సభలో, "సర్వసౌభ్రాత్రసమాజము"ను దేవయ్య స్థాపించుసందర్భమున, "బ్రాహ్మణులు ఇతరులను బెట్టు మితిలేని కష్టములను తొలఁగించుటకును, తక్కినజాతుల నన్యాయముఁజేసి విప్రులొకరె యిపుడనుభవించు హక్కులను వారినుండి కైకొనుటకును, ఈసమాజముత్పన్నమైనది!" అను దేవయ్య పలుకులు, సభాస్తారులను నిశ్చేష్టులుగఁ జేసెను. అపు డెవరికిఁదోఁచిన మాటలు వారాడిరి. "ఓహో! తొందరపడితిరి, ఊసరవెల్లియైనదే!" అని వార్ధకపు దౌర్బల్యముచేత వాకుమఁ బల్కి, కరణము బుచ్చిరాజు నిష్క్రమించెను. ఉపన్యాసమును తలవంచుకొనియే విని, మౌనముతో వర్మయింటికేగెను. గందరగోళమై, సభనుండి యందఱు లేచిపోఁగా, నలుగురు మాత్రము మిగిలిరి వీరపుడు నూతన సమాజ సభ్యులైరి. వీరికి కోమటికామయ్య కార్యదర్శికాఁగా, సభ్యులందఱి యనుమతిమీఁద దేవయ్యగారధ్యక్షులైరి.

*  *  *  *  *

నాఁటినుండియు దేవయ్యగారి గృహమును, పురవాసుల మనములును, అశాంతినిలయము లయ్యెను. ఇన్నాళ్లు వివేకిగనుండిన దేవయ్య కీర్తికాముత్వమను నురియందిపుడు తగులుకొనెనని యందఱనుకొనిరి. కాని, దొరతనమువారిచ్చు గౌరవపదవులు, సంఘమువారుచేయు మన్ననలును. వానికిఁ జాలవయ్యెను. తానున్నత కుల సంజాతుఁడని ప్రసిద్ధికెక్కవలెనని దేవయ్య యాశయము. "పుట్టుకతో రావలసిన జాత్యుత్కర్షముకొఱకు పరితపించెదవే?" యను వర్మమాటలు దేవయ్యకు నచ్చక, "చూడుము! నేను ఇంటగెల్చి రచ్చగెలిచెదనుసుమీ!" యనియతఁడు విజృంభించుచుఁ బలికెను. తమపూర్వులు గొప్ప బ్రాహ్మణేతర జాతిలోనివారని దేవయ్య యంతఁ బ్రచురించి, స్వదత్తముగు "నాయుఁడు" బిరుదమును స్వీకరించెను. అంత, పట్టుదల యందీయనకుఁ దీసిపోని పౌరప్రముఖులు కొందఱు దీనికెంతయు కనలి, వీరివంశావళిని గుఱించి విచారణముఁజేసి, యతఁడు హీనవంశజుఁడని నిర్ణయించి, యీ మహాసత్యమును వెలిపుచ్చునిచో లోకమునకుఁ దీరని నష్ట మాపాదిల్లఁగలదని విశ్వసించి, కరపత్రరూపమున నదిపట్టణమందల్లెడలను వ్యాపింపఁజేసిరి! ఈమహానుభావులలో మిక్కిలి యుత్సాహముతోఁ బనిచేసినవారు పెక్కండ్రు చతుర్థవర్ణపు సోదరులే! దేవయ్య కెచటనున్నతపదవి లభించినను, వారికిసంతోషమేకాని, దమనాలవజాతిలోమాత్ర మట్టియున్నతి వారికి దుస్సహముగఁ గానిపించెను!

*  *  *  *  *

ఈసమయమున నింకొకయాశ దేవయ్య హృదయమునఁ గలంచెను. తనరెండవకుమారుఁడును, కుశాగ్రబుద్ధియునగు వర్మకు వేదవిద్యఁజెప్పించి, యందువలన తమయశస్సును పెంపొందింపవలయునని యతని కోరిక. ఈవిషయమునుగుఱించి నారాయణవర్మతో దేవయ్య "ఆహా! బేపనోళ్లు ఎంతటికపటులు! ఎచటనైన "మామా" యనవచ్చునుగాని, వంగతోటలో సాగునా? బ్రాహ్మణులు తమకన్నులనైనఁ బెఱికి యిత్తురుగాని, హీనకులస్థులకు వేదవిద్య నిచ్చెదరా? కావున మన మీహక్కునెట్టులైన బలాత్కారముగఁ జేపట్టవలెను!" అనెను. ఇది విని నవ్వి వర్మ, "వెఱ్ఱివాఁడా! నీకోరిక కిదియదనుకాదు. నీవేమనుకొనుచున్నావోకాని, ఇట్టిపనులచే బ్రాహ్మణేతరులకు లాభలేశమును గలుగదు. మీఁదు మిక్కిలి యది విప్రులకుఁ గోపావేశముఁ గలిగించును. ఇదివఱకే నిన్నుఁ జూచి కటకటఁబడు బ్రాహ్మణులను నీనూతనోద్యమము

నిప్పులుద్రొక్కిన కోఁతులను జేయునుసుమీ!" యని యాలోచనఁ జెప్పెను.

కాని దేవయ్య వర్మయాలోచన వినువాఁడుకాఁడు. ఈవిషయమై యింకనితఁడు, "వర్మమువిడిచి బాపనోళ్లు చదువుచెప్పుదురా? ఉపనయనమైనఁగాని, వేదాధ్యయనము చేయఁగూడదఁట! ఉపనయనమునకు మాబ్రాహ్మణేతరుల కధికారములేదట!" యని పలుమారు తలపోసెను. ఈసంగతిలోను వర్మ తనతోఁ గలియకుండుట ఆతనికిఁ గోపముఁ గలిగించెను. కాని, యిట్టి యాటంకములకు భీతినొంది దేవయ్య తనయుద్దేశ్యములను విరమించుకొనువాఁడుకాఁడు. ఎట్టులైనఁ దనచిన్నకుమారునికి వేదవిద్యఁ జెప్పింప నతఁడు పట్టుబట్టెను. ఇది నెపముగఁ దన కుటుంబమున నుపనయన సంస్కారము వెలయింపవచ్చునని దేవయ్య మఱింత సంతోషించెను!

ఆకాలమున స్వపక్షమువారి నుద్ధరింపఁబూని బ్రాహ్మణేతర ప్రముఖుఁడగు స్వామి "ఆత్మారాము" గారు, రాజమహేంద్రవర ప్రాంతములందు హీనకులజులకు ఉపనయనాది సంస్కారములు చేయించుచుండిరి. వాని యోజనమునఁ దనకుమారునకిపుడు దేవయ్య వడుగు చేయింపఁ బూనెను. ఈయుత్సవసమయమున, ఆహూతులును, అనాహూతులును బ్రాహ్మణోత్తము లనేకులు దేవయ్యయింటికిరాఁగా నతని కమితోత్సాహము జనించెను. బ్రహ్మగారి మంత్రోచ్చారణమునకు విప్రులు నవ్విరి. తమయాశీర్వాదము లొసంగఁడని యాజ్ఞికుఁడంత సదస్యుల నడుగఁగా, వారొకరిమొగ మొకరు చూడఁ జొచ్చిరి. సంభావనలందుకొని కొందఱును, గైకొనక కొందఱు నంత నొకసారిగలేచి, కేకలిడి, చప్పట్లు గొట్టి, తమకడుపుబ్బ నొకింతఁ దీర్చుకొనిరి! శుభకార్యసమయమున వారిట్లుచేయుట తగదని వర్మ చెప్పఁబోవుచుండఁగా, "నీచదువుచదివియే దేవయ్య ఇంతవట్టుకువచ్చినాఁడులే!"యని బ్రాహ్మణులు బొబ్బరించుచు, వీథిఁ బడిరి.

* * * * *

ఆనాఁడు పురమంతయు జనుల కోలాహలములతో నిండిపోయెను. రాజవీథులలోని గోడలమీఁదనెల్ల, "చాకలి అత్త, మంగలి మామ!" అను పెద్దయక్షరములు మసిబొగ్గుతో వ్రాయఁబడెను. ఇదివఱకు దేవయ్యను వినుతించుచుండిన నోళ్లే, తమ సొమ్మంతయు నతఁడపహరించినట్టుగ వానిని దూషింప సాగెను. అనాదిగ తమ జాతి సొమ్మగు నుపనయన సంస్కారమును అన్యాయముగ స్వీకరించిన యీహీనకులజుఁడు వర్ధిల్లఁడని ద్విజులు ఘోషించిరి. దేవయ్య నూతన సంస్కరణమువలనఁ దమకికఁ గొంతప్రాముఖ్యము గలుగునని కొందఱు బ్రాహ్మణేతరులు మురియుచున్నను, ఇదికారణముగఁ దమకే విపత్తు మూడనున్నదోయని కొందఱు భీతినొందిరి.

కుమారుని వడుగుమూలమున జనులకనిష్టుఁడైన దేవయ్య మితిలేని సాంఘిక బాధల పాలయ్యెను. శుభాశుభములకు వీరింటికి బ్రాహ్మణులు రాకుండిరి. వారి ప్రోత్సాహముచేఁ దక్కిన జాతులవారును దేవయ్యను బహిష్కరించిరి. దేవయ్య యెంతపలుకుబడిగలవాఁడైనను, వానిసొమ్మును ద్రొక్కిన వానిని వెలివేసెదమని శత్రువులు భయపెట్టిరి. చాకలులు, మంగలులు వీరికిఁగఱవైరి. దేవయ్య యింటిమీఁద రాత్రులు రాళ్లు పడుచుండును. ప్రొద్దునలేచి నడచు వారికి వారివాకిటఁ బల్లేరుగాయలు గ్రుచ్చుకొనుచుండును. తన సంరక్షణార్థము దేవయ్య యిపుడు నియమించిన రక్షకభటులు చేరువనున్నప్పుడే పరిస్థితులు మఱింత ఘోరముగ నుండుటఁ జూచి, యీయేర్పాటును దేవయ్య మానుకొనెను.

* * * * *

ఇట్లు పలువురి కనిష్టుఁడైన దేవయ్యమీఁద దేవునకుఁగూడ నిపుడు దయతప్పినట్టులుతోఁచెను. శుభకార్యమునకై గుమ్మమునఁ గట్టిన తోరణము వాడకమునుపే యాయింట నశుభ ముప్పతిల్లెను. వడుగునాఁడు పెట్టిన కనులకాటుకయు, బుగ్గ చుక్కయు మాసిపోకమునుపే పెండ్లికొడుకు మంచమెక్కెను. దగ్గు పడిసెములతో నారంభమైన రోగము విషజ్వరముగఁ బరిణమించెను. చెన్నపురినుండి చికిత్సఁజేయవచ్చిన ఘనవైద్యులు రోగినిఁజూచి మూతివిఱిచిరి. తలిదండ్రుల కల్లారుముద్దుగఁ బెరిగి స్వజాత్యుద్ధరణమునకై కొండంత పనిచేయనున్న చిన్నివర్మ యకాల మృత్యువు వాతఁబడెను.

ప్రజలు తమ వెఱ్ఱితలంపులే వేదాంత సూత్రములని భ్రమింతురు. శాస్త్రవిరుద్ధకార్యము జరుగుటచేత,

ఈశ్వరానుగ్రహమునను బాల్యపడి, నలుగురి నోళ్లబడి, చిన్నవర్కు నమసిపోయెనని యగ్రజాతులగా రనుకొనిరి. బ్రాహ్మణుల శాపము దేవయ్యకుఁ దగిలినదని కొందఱును, దయ్యము పట్టించి బాలకుని విప్రులు పరిమార్చిరని మఱి కొందఱును, బ్రాహ్మణేతరులలో ననుకొనిరి.

* * * * *

వానలు గురిసిన వాతలుమాసునా? ఇట్టికష్టకాల మందైనను తమ పూర్వవైషమ్యములు మఱచి దేవయ్య నాదరించుట తమధర్మమని బ్రాహ్మణులకుఁ దోఁపదయ్యెను. మనుష్యమాత్రులు మనల నేమి చేయఁగలరని ధైర్యమునూని, తమ యుద్యమము మీఁదనే దృష్టియిడి, ఋజువర్తనమునఁ గార్యసాధనము చేయవలయునని దేవయ్య గ్రహింపకుండెను. క్షమాదాక్షిణ్యములు కష్టకాలము తమకుపదేశించెడి ఘనప్రభోధనములని యిరుపక్షముల వారు నిట్లు గుర్తెఱుఁగక, పూర్వపువైరమార్గమునే యవలంబించి, యాత్మశాంతిని వీడియుండిరి.

* * * * *

దేవయ్యపుత్రుఁడు చనిపోయెననువార్త వినఁగనే పురమందలి భూదేవోత్తముల ముఖ కమలములు వికసిల్లెను. పూజా పురస్కారము లెఱుఁగక బూజుపట్టియుండు దేశములందలి దేవత లానాఁడు అభిషేకము లందుకొనిరి. సానదులందును రచ్చపట్టులందును సరససల్లాపములతో నగరనివాసులు ప్రొద్దుపుచ్చిరి. "బ్రాహ్మణ ద్వేషము బ్రహ్మద్వేషమే" యని విప్రోత్తములు ఎలుగెత్తియఱచిరి. "ఈ కలికాలమున బ్రాహ్మణుల మహిమ యంత గానరాకున్నను, ఏ పుట్టలో నేపామున్నదో మన కేల?" యని తక్కినవర్ణములవారు గుసగుసలాడుచు, మెల్ల మెల్లగ నడుగులు వేసిరి.

* * * * *

చెఱుపఁగోరువాడుఁ జెడిపోవును. కష్టకాలమునఁ బరుని దుఃఖము చూచి వినోదించువాఁడు నవ్వునోటనే రోదనము చేయ నారంభించును. దేవయ్యమీఁది కెగసిన యాపౌరుల యపహాసబాణములు, అచటినుండి మఱలి వచ్చి, వారియాయువుపట్లకే తగిలెను. పుత్త్రిమరణము వలన దేవయ్యహృదయమున జనించిన వైరాగ్యము త్వరితగతి నంతరించిపోఁగా, తీవ్రకోపానల జ్వాలలందుండి వెడలి శత్రులను దాఁకెను. ఇదివఱకు సమాత్వబుద్ధియు న్యాయమార్గాను వర్తనమును నియమములుగఁ బూనిన దేవయ్య, ఇపుడు తనపక్షమువారి నుద్ధరించుటయు, పరుల నుక్కడఁగించుటయు తన ప్రియనర్మములుగఁ జేసికొనెను! పౌరులందఱి సౌఖ్యము నొడగూర్చుటకు మాఱుగా, స్వజాతీయుల నున్నతికిఁ గొనివచ్చుటయు, పెఱవారలఁ బేజిక్కిచుటయు దేవయ్య యిపుడు నియమములుగఁ జేసికొనెను! ఎదుటి కక్షనుండువారి కన్నులు నిట్టి మహాశయముల మీఁదనె వ్రాలియుండెను! నాయకులట్లనే భృత్యులు నుందురుకదా. ఈనగరమున వివేక న్యాయమార్గాను వర్తనముల స్థానమునిపుడు ప్రాపు, స్వజాత్యభిమానము నాక్రమించినవి!

* * * * *

ఆవుపాడియెన్నాళ్లు, ఐశ్వర్యమెన్నాళ్లు? ఇపుడీపట్టణ పరిపాలకసంఘమున దేవయ్య కేమియు తావులేకున్నదే? ఈనడు చనిపోయిన బుచ్చిరాజు కొడుకు కామరాజు, పట్టుదలలో తండ్రిని తలదన్నునట్టివాఁడు! శత్రు పరాజయమొకటియె వానికిఁజాలదు. పరులను పరిభవించి వారిని పరిమార్పవలెననియే యతఁడు వ్రతముగఁ జేకొనిన మహనీయుఁడు! తన నిరంకుశప్రభుత్వమున మచ్చునకైన పరులజాడ గానఁబడఁగూడదని నిర్దేశించి, న్యాయధర్మములను మూలఁద్రోచివైచి, మెలంగెడి మహనీయుఁడు! కొండంతయల వచ్చునపుడు,చిన్న కెరటములు క్రింది కణఁగిపోవును. దేవయ్యయు వానియనుచరులు నిపుడు పగటి పూఁట చుక్కలైరి.

ముందుకురానున్న ముద్దుల కొమరుఁడు ముక్కలయ్యెనని విచారమున నీలమ్మ కృశించి కాలముచేసెను. వానివ్యాపారమున నెదురుచూడని గొప్పనష్టమొకటి దేవయ్యకీసమయమునవె యాసన్నమయ్యెను. కష్టనష్టములిటులు దేవయ్యను బరివేష్టింపఁగా, ఇదే సమయమునివాని శరీరమున క్షయప్రవేశించి, కొలఁది కాలములోనే వాని జీవములఁ గొనిపోయెను.

* * * * *

దేవయ్యను గుఱించి "ధర్మబోధినీ" పత్రిక యిట్లు వ్రాయుచున్నది. "కీర్తిశేషులైన దివానుబహద్దరుగారు ఆంధ్రదేశమందలి యాప్రాంతములలో బ్రాహ్మ

ణేతరపక్షమువారికిఁ బెట్టని కోటవంటివారు. తమ పురము నిరువది వత్సరము లేకచ్ఛత్రాధిపత్యమున నేలిన మహనీయులు. వీరినాయకత్వమున నిరాధారులగు బ్రాహ్మణేతర సోదరు లనేకులకు నిలువనీడగలిగినది. బ్రాహ్మణేతరులు తమ స్వత్వములఁ బెంపొందించుకొని, కృతకృత్యులైరి. దేవయ్యగారు, స్వజాతీయులకుఁ గలుగు నన్యాయములతో బెబ్బులివలెఁ బోరాడి, విజయముగాంచిన విక్రమశాలి. వారికీర్తి పుడమిని ఆచంద్రతారకముగ నుండఁగలదు.”

దీనిని విమర్శించుచు “సనాతన ధర్మవర్ధనీ” పత్రిక ఇట్లు వాకొనుచున్నది:— “దివాను బహద్దరుగారివంటి కార్యశూరు లుద్భవించుట మనయాంధ్రుల పుణ్యఫలమే. కాని, ప్రప్రథమమునందువలె పిమ్మటను దేవయ్యగారు జనులందఱి యభ్యున్నతికిని తమ యపారసామర్థ్యమును వినియోగించి యుండినచో, వారిపురము అంతర్జాతీయ వైషమ్యముల కాలవాలము గాక శాంతిసౌఖ్యముల నోలలాడుచుండెడివి. దివానుబహద్దరుగారు బెబ్బులివలె పోరాడిన మాటసత్యమే. కాని, వారి కోపానలము భస్మీభూతము చేయఁబూనినది యధర్మ న్యాయములనుగాక, యగ్రవర్ణముల యభ్యున్నతినే! వారుతొలుతఁగనఁ బఱచిన న్యాయైకదీక్షయు, పరోపకారపాంకితయు, లోకుల కన్నులఁగప్పిపుచ్చుటకు ఉపయోగమైన, స్వార్థపరత్వమేకాని, నిజమైన ధర్మబుద్ధిచే ప్రచోదితములై నవికావు 'బ్రహ్మద్వేషం న కారయేత్!' అనునార్యోక్తి యెన్నఁటికిని ననృతము కానేరదుకదా!”

జాతికలహములనడుమ సత్యమా, నీకు నిలువ నెల వెక్కడిది?

---

# పాపాయి

## నాళము కృష్ణరావు గారు

### సందేశము

మేల్మిబంగరురంగుల మిసిమితోడ
వెలుఁగు లీనుచు, నోచిన్ని వేగుఁజుక్క!
ఒంటిగా నేల తిరిగెదు మింటిమీఁద?
నిలిచి నాతోడ నొకమాట పలుక వయ్య

ఒక్కటొకటిగ నీతోడిచుక్క లెల్ల
నోసరిల్లెను, తొలికోడి కూసె, నదిగో!
తూర్పుదిక్కున సంజలు తొలకరించె;
ఏల తిరిగెద వీలీల బేల వోలె?

కలువచెలికాఁడు చని యొక్కగడియ యయ్యె
ఇనుఁడు చనుదెంచు క్షణములో; నింతలోనె
ఏల నెంచితె యాకాశ మెల్ల నొకట?
నిలిచి నామాటలకు మాఱు పలుక వయ్య!.

నాదుముద్దులకొమరుండు నన్ను విడిచి
ఏడుమాసము లయ్యెఁ దా నెటకొ చనియె,
ఇంతకాలముదనుక నాచెంత రాఁడు;
అతని విడనాడి నే నింక బ్రతుకఁ గలనె?

నిన్నుఁ బోలిన వన్నెలు చిన్నెలొలుకు
సోయగమువాఁడు, చక్కనిచుక్క యతఁడు;
చుక్కగమిలోనఁ దా నొక్కచుక్క యగుచు
నున్నవాఁ డేమొ చూడుమా యొక్కసారి.

ఉన్నచో వేగ నాతనియొద్ద కీవు
చేరి మెల్లఁగ నడుగుమా చిన్నమాట
ఇప్పుడైనను మఱి యింక నెప్పుడైన
నిచ్చటికి వాఁడు క్రమ్మఱ వచ్చునేమొ?

ఇటకు వచ్చుట కతని కనిష్టమైన
అటకునైనను రప్పించుమంచు ననుము;
వాని కటు చేయ నలవికాదేని, వాని
పొంతకే వైనఁ దోడ్కొనిపొమ్ము నన్ను.